క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కమలాపూర్: కమలాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్, మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని కమలాపూర్, గూడూరు, వంగపల్లి, దేశరాజుపల్లి గ్రామాల్లోని గృహ, వ్యవసాయ విద్యుత్ ఫీడర్లలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

శాయంపేట : మండల కేంద్రంతో పాటు కొప్పుల గ్రామంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతు దృష్ట్యా విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ చందూలాల్ శుక్రవారం తెలిపారు.

జీపీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలి

దామెర : గ్రామపంచాయతీ భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్, ఏఈ, ఎంపీఓలు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతన గ్రామ పంచాయతీ నిర్మాణానికి వారు ముగ్గుపోసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు మన్యం ప్రకాష్‌రెడ్డి, దురిశెట్టి భిక్షపతి, పోచయ్య, రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, ప్రవీణ్, రవి, లింగయ్య, రమేష్, రజనీకర్‌లు పాల్గొన్నారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు: సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సఖి ప్రతినిధులు లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ భారతి అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో సఖి సేవల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. మాధవి, యశోద పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత



ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి, నందనం గ్రామాల్లో పోలీసులు రేషన్‌బియ్యం పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా గూడ్స్ ట్రాలీ ఆటోల్లో బియ్యం తరలిస్తుండగా ఒంటిమామిడిపల్లిలో 18.5 క్వింటాళ్లు, నందనంలో 5 క్వింటాళ్లు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గుగులోతు నర్సింహ, భూక్య జయందర్‌తో పాటు ఆటోలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మరమ్మతులు చేపట్టాలి



నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో టైల్స్ పగిలి పలుచోట్ల భారీ రంధ్రాలు ఏర్పడి విషపురుగులకు నిలయంగా మారింది. ఒకే కేంద్రంలో మూడు సెంటర్లు నిర్వహిస్తున్నారు. రోజు 30 మంది వరకు అంగన్‌వాడీ పిల్లలు వస్తున్నారు. ఎలుకలు చేసిన పెద్ద పెద్ద రంధ్రాలు పాములు, ఇతర విషపురుగులు తరుచుగా వస్తున్నాయని అంగన్‌వాడీ టీచర్స్ తెలిపారు. పలు మార్లు అధికారులకు, పాలకుల దృష్టికి తీసుకపోయినా స్పందన లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టి సారించి అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మరిచారా.. మాయం చేశారా ?

- యూటర్న్‌ల వద్ద కనిపించని హెచ్చరిక రేడియం స్టిక్కర్ బోర్డులు
- ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు





పలు యూటర్న్‌ల వద్ద కనిపించని హెచ్చరిక రేడియం స్టిక్కర్ల బోర్డు

నడికూడ : రోడ్లు, భవనాల శాఖ అధికారులు రేడియం స్టిక్కర్లు వేయడంలో విఫలం కావడంతో నిత్యం ఏదో ఒక వాహనం ప్రమాదానికి గురవుతూ ప్రమాదాలకు పరకాల–హుజూరాబాద్ ప్రధానరోడ్డు అడ్డాగా మారుతోంది. ఐదేళ్ల క్రితం పరకాల నుంచి హుజూరాబాద్ వరకు రెండు లైన్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. అవసరమైన చోట హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేసినా కొన్ని యూటర్న్‌ల వద్ద, కల్వర్టుల వద్ద హెచ్చరిక స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడం శోచనీయం. ఇటీవల ఓ యూటర్న్ వద్ద ప్రమాదం జరిగి ప్రయాణికులు తీవ్రంగా గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

రహదారిని ప్రతి మూడు నెలలకోసారి రోడ్లు, రహదారుల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రాత్రి వేళల్లో వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా వాహనదారులకు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి



రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు, భవనాల శాఖ అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలి.

– బొట్ల అరుణ్(ముస్త్యాలపల్లి)

రాత్రివేళ నడపాలంటే భయం



రోడ్డు వెంబడి హెచ్చరిక రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. రాత్రి వేళల్లో నడపాలంటే భయం వేస్తుంది.

– గుడిశాల రంజిత్ కుమార్(నడికూడ)

వివేకానంద యువతకు ఆదర్శం

- పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ



మాట్లాడుతున్న ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ

పరకాల: నేటి సమాజంలో యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధి, దేశ కీర్తిప్రతిష్టలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేయాల్సిన అవసరం ఉందని పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా పరకాల సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించి ఆయా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీఓ హాజరు కాగా మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుష్మ, ఫోరం సభ్యులు స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిరంతరం చదువుపై శ్రద్ధ చూపి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. ప్రధాన వక్త లక్ష్మణాచారి మాట్లాడుతూ భారత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని పేర్కొన్నారు. సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి తమ భవిష్యత్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుకునేందుకు ముందుకు సాగాలని కోరారు. సిటిజన్ ఫోరం ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఫోరం కన్వీనర్ డాక్టర్ ఎన్.విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో సిటిజన్ ఫోరం సభ్యులు ఆర్‌పీ జయంత్‌లాల్, బండి సారంగపాణి, గందె వెంకటేశ్వర్లు, చొల్లేటి సునేందర్, ఇంగిళి వీరేష్‌రావు, బెజ్జంకి కరుణాకర్, పాలకుర్తి తిరుపతి, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

వేలేరు: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై నాల్గో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 01-04-2023 నుండి 31-03-2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు సేకరించిన సమాచారం నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.2 కోట్ల 9లక్షల586లపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, కూలీల సంతకాలు లేకుండా వేతనాల చెల్లింపుల వంటి తప్పిదాలపై 14 గ్రామాలకు రూ.12,286 జరిమానా విధించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ విమల, ఈజీఎస్ అంబుడ్స్ పర్సన్ డీవీఓ నరసింహా రెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, డీటీసీ శ్రీధర్ రెడ్డి, ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : సీఐ



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ రంజిత్‌రావు

శాయంపేట : విద్యార్థులు, యువకులు క్రీడలు ఆడాలని క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని శాయంపేట సీఐ రంజిత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో రైసింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవాకరం సీఐ, ఎస్సై జక్కుల పరమేశ్‌లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత వ్యసనాలు వదిలేసి క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శాయంపేట : ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని వివేకానంద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గిద్దమారి సురేష్ తెలిపారు. విజేతలకు ఈ నెల 12న స్వామి వివేకానంద విగ్రహం వద్ద బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాకు నిధుల మంజూరు



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరిలో రానున్న వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వరంగల్ ఎంపీ కడియం కావ్య రూ.14 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు వల్లపురెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని మడికంటి రాజయ్య ఇంటి పరిసరాల్లో, పులిచేరు బండ దగ్గర, సరోజనమ్మ బావి సమీపంలో బోర్ మోటార్లు, పైప్‌లైన్‌లు, ఎస్సీ కాలనీ బావి వద్ద నుంచి వాటర్ ట్యాంకు వరకు పైప్‌లైన్, సింగరాయకుంట బావి వద్ద నుంచి గ్రామంలోకి మోటార్, పైప్‌లైన్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయగా మోటార్లు, పైపులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మడికంటి రాజయ్య, మాజీ సర్పంచ్ బుద్దె రమేష్, మాజీ ఉపసర్పంచ్ పుట్ట కుమార్, వెంకన్న, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తల్లితో వచ్చి..మరో బస్సులో వెళ్లిన తనయుడు

- మతిస్థిమితం లేని యువకుడు
- సీసీ కెమెరాలతో ఆచూకీ కనుగొని తల్లికి అప్పగించిన పోలీసులు



యువకుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

పరకాల: సీసీ కెమెరాల సాయంతో మతిస్థిమితం లేని యువకుడి సమాచారం తెలుసుకున్న పరకాల పోలీసులు తల్లికి అప్పగించారు. వివరాలోకి వెళితే.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్.ఎం కొత్తపల్లికి చెందిన బిళ్లకంటి సుకోపాల అనే మహిళ మతిస్థిమితం లేని కుమారుడు విన్నును కరీంనగర్‌లోని వికలాంగుల వసతిగృహం నుంచి వారి స్వగ్రామానికి వెళ్లేందుకు పరకాలలో హుజూరాబాద్ బస్సు దిగి వారి గ్రామం బస్సు కోసం శుక్రవారం ఉదయం ఎదురుచూస్తున్నారు. కానీ కొద్దిసేపటికే విన్ను కనిపించకపోవడంతో బోరుమని విలపిస్తూ పోలీసులను ఆశ్రయించింది. దీంతో సీఐ క్రాంతికుమార్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాల కంట్రోల్ రూం ఇన్‌చార్జ్ సుధాకర్, కానిస్టేబుల్ నాగరాజులు వెతికి మరో బస్సులో వెళ్లినట్లు గుర్తించారు. దీంతో ఆ బస్సు కండక్టర్, డ్రైవర్లకు సమాచారం అందజేసి మతిస్థిమితం లేని యువకుడిని తల్లికి అప్పగించారు. ఫిర్యాదు అందగానే ఆచూకీ తెలుసుకొని యువకుడిని తల్లికి అప్పగించిన హోంగార్డు, కానిస్టేబుల్‌ను సీఐ, ఎస్సై రమేశ్ అభినందించారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

నడికూడ: మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన సున్నపు రాజేందర్ కొన్ని రోజుల నుంచి గ్రామ శివారులో ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారు చేసి విక్రయిస్తుండగా ఇటీవల శాయంపేట మండల పరిధిలో పట్టుబడగా శుక్రవారం తహసీల్దార్ నాగరాజు ఎదుట బైండోవర్ చేశారు.

సోలార్ ప్లాంట్ల నిర్వహణకు సర్వే



ధర్మసాగర్ : మండలంలోని వివిధ గ్రామాల్లో సోలార్ ప్లాంట్ల నిర్వహణకై శుక్రవారం అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. మండలంలోని ధర్మసాగర్, నారాయణగిరి, ముప్పారం, జానకిపురం, పెద్దపెండ్యాల, ధర్మపురం, ఉనికిచర్ల, ఎల్కుర్తి గ్రామాల్లో స్వయం సహాయక బృందాలచే సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కావలసిన భూసేకరణ నిమిత్తం రెడ్కో మేనేజర్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ అనిల్ కుమార్ సంయుక్తంగా సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో డీపీఎం జన్ను ప్రకాష్, దిలీప్, ఏపీఎం అనిత, ఆర్ఐ కిరణ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికల హక్కులను కాపాడాలి

- సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్



దామెర : మాట్లాడుతున్న దామోదర్

దామెర : ప్రతి ఒక్కరూ బాలబాలికల హక్కులను కాపాడాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు, శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లింగఆధారిత వివక్ష, లింగ సున్నితత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనలు, ఆశయాలతో వ్యక్తిగత బలంతో ఎదగాలని తెలిపారు. సర్వోదయ సంస్థ పాఠశాలల్లో బాలపరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి బాలల హక్కులకు భంగం వాటిల్లకుండా, వారికి సహాయ సంస్థలపై అవగాహన కల్పించి బాలబాలికల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ సర్వోదయ సంస్థ నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చిన 9 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్కొన్నారు.

కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

నడికూడ : కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడమే సర్వోదయ లక్ష్యం అని సర్వోదయ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడుతూ మహిళ సాధికారత కోసం ప్రతి ఒక్కరం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల నాగరాజు, ఎంఈఓ కుసుశోతు హనుమంతరావు, సర్వోదయా ప్రతినిధులు, మహిళ సహాయక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లులు



కమలాపూర్ : విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కమలాపూర్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కమలాపూర్ బస్టాండ్ ప్రాంగణంలో పుల్లా ఫ్యామిలీస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనూషకు ప్రథమ బహుమతి రూ.10,116, పుల్ల హేమలతకు ద్వితీయ బహుమతి రూ.5,116, మౌటం లావణ్యకు తృతీయ బహుమతిగా రూ.3, 116 విలువ గల పట్టు చీరలతో పాటు పది మందికి ప్రోత్సాహక బహుమతులుగా చీరలు అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ పుల్లా పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ తౌటం ఝాన్సీరవీందర్, రిటైర్డ్ ఏఎస్పీ పుల్ల సంజీవ్, స్థానిక సీఐ హరికృష్ణ అందజేశారు.

జూనియర్ కళాశాలలో..

సంక్రాంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రంగవల్లులు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

పరకాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కె.సంపత్‌కుమార్ అభినందించారు.

ఎల్కతుర్తి: మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామస్థాయి ముగ్గుల పోటీలను శుక్రవారం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఎల్కతుర్తి మొదటి స్థానంలో నిలిచినట్లు ఏపీఎం రవీందర్ తెలిపారు.

ఐనవోలు: విద్యార్థులకు సంస్కృతీ సంప్రదాయాలు విద్యార్థి దశ నుంచే నేర్పించాల్సి ఉందని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా సంక్రాంతి ముగ్గులు వేశారు. ముగ్గులు వేయడంలో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందజేశారు.

బకాయిలు చెల్లించాలి

కమలాపూర్: పెండింగ్‌లో ఉన్న కరువుభత్యం బకాయిలు, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఎంఈఓ ఇ.రాంకిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ శ్రీధర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజమల్లయ్య, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, అంజనీదేవి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

హనుమకొండ జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో, మండలంలోని గ్రామాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్వామి వారిని ఉత్తరద్వారం ద్వారా భక్తులు దర్శనం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు బారులుతీరారు.

– సాక్షి,నెట్‌వర్క్



ఐనవోలు : ఉత్తరద్వారం ద్వారా దర్శనం చేసుకుంటున్న భక్తులు



శాయంపేట : శ్రీమత్స్యగరి స్వామి ఆలయంలో..



శాయంపేట : శ్రీమత్స్యగరి స్వామి ఆలయంలో..



పరకాల : శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో..



కమలాపూర్ : ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

వాహనదారులు అన్ని పత్రాలు కలిగిఉండాలి



శాయంపేట : ప్రతీ ఒక్క వాహనదారుడు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉన్నప్పుడే వాహనాలను నడపాలని ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. మండలంలోని పత్తిపాకలో శుక్రవారం రాత్రి వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయకూడదు. ప్రతి ద్వి చక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దన్నారు. ఫోర్ వీలర్స్ వారు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

ఆత్మకూరు : పురుగుల మందు డబ్బా, థమ్సప్ బాటిల్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడడానికి సిద్ధమైన యువకుడిని పోలీసులు పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని హౌజుబుజుర్గుకు చెందిన సుభాన్ ఇంట్లోవాళ్లతో గొడవపడి చనిపోతానని వెళ్లి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోగా ఈ విషయాన్ని యువకుడి తల్లిదండ్రులు ఆత్మకూరు సీఐ సంతోష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి హెడ్‌కానిస్టేబుల్ నర్సింగరావు, హనుమకొండ కానిస్టేబుల్ మహేష్ ఐటీ కోర్ సిబ్బంది సల్మాన్ తదితరులు లొకేషన్ ఆధారంగా హనుమకొండ బస్టాండ్ వద్ద యువకుడిని గుర్తించారు. మందుడబ్బాను తీసుకొని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. కాపాడిన హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లను సీఐ సంతోష్ అభినందించారు.

విద్యుదాఘాతంతో పాలేరు మృతి



నాగయ్య(ఫైల్)

ఎల్కతుర్తి : విద్యుదాఘాతంతో వ్యవసాయ పాలేరు మృతి చెందిన సంఘటన భీమదేవపల్లి మండలం ముస్తాఫాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. ముస్తాఫాపూర్‌కు కనుకం నాగయ్య(65) రెండేళ్ల నుంచి అదే గ్రామానికి చెందిన బొక్కల ఇంద్రసేనారెడ్డి బావి వద్ద వ్యసాయ పాలేరుగా పనిచేస్తున్నాడు. రోజు వారి పని నిమిత్తం వ్యవసాయ బావివద్దకు వెళ్లి మొక్కజొన్న పంటకు నీరు పెడుతుండగా కరెంట్ తీగకు తగిలి విద్యుత్ ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఎల్కతుర్తి: వేలేరు మండలంలోని కన్నారం గ్రామం ఇచ్చుళ్లపల్లికి చెందిన మీడిదొడ్డి స్వామిరాజు(46) తన వ్యవసాయ పనులు ముగించుకొని హనుమకొండలో చదువుతున్న తన పిల్లలను సంక్రాంతి సెలవులకు ఇంటికి తీసుకురావడానికని తన బైక్‌పై రమేశ్‌తో కలిసి వెళ్తున్నాడు. మల్లారం గ్రామశివారులోకి వచ్చేసరికి కొత్తకొండ నుంచి అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ వెనుకడబ్బా రమేశ్‌కు చాతిభాగంలో బలంగా తగలడంతో అదుపుతప్పి ఇద్దరు కింద పడిపోగా స్వామిరాజుకు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి జారుకున్నాడు. రమేష్ 108 వాహనానికి ఫోన్‌ద్వారా సమాచారం ఇవ్వడంతో వెంటనే ఇద్దరిని హనుమకొండ ఆస్పత్రికి తరలించారు. స్వామిరాజ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సాయిబాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి : చైర్‌పర్సన్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సునంద

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లోని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బీరం సునంద సుధాకర్‌రెడ్డి అన్నారు. గుడెప్పాడ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తోడ్పడతామన్నారు. రైతులు మార్కెట్లో అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, పాలకవర్గ సభ్యులు రమేష్ యాదవ్, పిట్టల రాజేందర్, షేక్ నవీర్, సోనబోయిన రవి, దామెర శంకర్, ఆత్మకూరు సొసైటీ చైర్మన్ జనగాం ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.